


వార్త చదవడానికైతే చదివేనేగాని వివరాలు పూర్తిగా గుర్తులేవు. మొత్తానికి ఇండియాలోనే జరిగింది. నార్తో, సౌతో జ్ఞాపకంలేదు. వొకానొక హిందీ సినిమా మూట ఎనభై రోజులు ఆడిందట. రెండేళ్ళు వరుసాగ్గా ఆడిన సినిమాలుకూడా వున్నాయి. గనక అందుకు ఆశ్చర్య పడక్కర్లేదు. అయితే విశేషమేమిటని అడగండి. ఆ సినిమా ఆడిన నూటెనభై రోజులూ ఏ ఒక్క రోజుకూడా మిస్సవ్వకుండా ఒక ముసలమ్మ ఆ సినిమా చూసే సిందిట. ఆ వయస్సులో ఆవిడ అంత పట్టుదలగా ఆ సినిమా చూసినందుకు సినిమాహాలు వాళ్ళు సంతోషించి, ఆమెకి చీరా, రవిక ప్రెజెంట్ చేసేరు. అక్కడితో ఆగిపోకుండా మామ్మగారూ ఈ సినిమాలో మీకు నచ్చిన

పాయింట్లేమిటని అడిగేరు. వాకేవాక ఖవాలీ పాట మామ్మగార్ని ఆకర్షించ డమూ, అందుకామె నూటెనభై రోజులూ వోపిక తెచ్చుకుని, సినిమాచూసి బోలెడు డబ్బు ఖర్చు చేసుకుందంటే ఇదంతా పబ్లిసిటీ అనుకుంటే కళ్లు పోతాయి. ఖవాలీ పాటపట్ల అది ఆమెకుగల ఆరాధన అని చెప్పుకుంటే ఆనందంగా వుంటుంది. మామ్మగారికి ఖవాలీ పాటపట్ల గల ఆరాధనకు చెయ్యెత్తి మొక్కాల్సిందేగాని కానుకలిచ్చి సెభాషంటే సరిపోదు.

వ్యసనంతో ఆరాధనను పోల్చినప్పుడు నాదే పొరపాటు. అయితే గుణంలో రెండూ రెండే. దేనికేదీ తీసిపోదు. సినిమాలు చూడడం ఆరా ధనే. చూసిన సినిమాని మళ్ళా మళ్ళా చూడటం క్లాస్ వన్ ఆరాధన. దేవ దాసుని నూటపాతికసార్లు చూసినవాళ్లున్నారు. పాతాళభైరవిని రెండొందలు తడవులు దర్శించుకున్న భక్తులున్నారు. రేపు పరీక్ష పెట్టుకుని ఇవాళ మూడు ఆటలూ చూసిన ప్రబుద్ధులు నాకు తెలుసు. ఎకనమిక్సులో ఏ పేజీలో ఏముందో తెలీకపోవచ్చు? సినీమాలో ఏ డైలాగు తరువాత ఏ డైలాగు పేలుతుందో చెబుతారు. ఏ రీల్లో ఏ పాట వస్తుందో తప్పకుండా చెబుతారు. ఇవంతా కూడా ఆరాధనకిందే జమ కట్టాలి.

శృతిమించిన ఆరాధనవల్ల అనర్థాలు చాలా వుండొచ్చు. అనర్థాలకు భయపడి ఆగిపోతే అది ఆరాధన అనిపించుకోదు. ఏకలవ్యుడు ద్రోణా చార్యులవారికి డైరెక్టుగా శిష్యుడు కానేకాదు. ఆచార్యులపట్ల ఆరాధన పెంచు కోడంవల్ల శిష్యుడిగా తనకి తానే చెప్పుకున్నాడు. విలువిద్యలో మొనగాడై పోయాడు. ఇంకోడూ మరొకడైతే ఏకలవ్యుడ్ని చూసి ముచ్చటపడి వుండాల్సింది.

ప్రేమల్లోకూడా ఆరాధనలుంటాయి. లైలా-మజ్నూ, దేవదాసు-పార్వతీ, రోమియో-జూలియట్లు మధ్య ఆరాధన టన్నులకొద్దీ వుందనే చెప్పాలి. కాని అవన్నీ విషాధ గాథలుగా నిలిచిపోయినందుకు మనం విచా

రించాలి. నా ఆరాధనే నాచేత కథలు రాయించి నన్ను కథారచయితను చేసిందని మొన్నామధ్య ఒక ప్రేమ కథకుడు నాతో అన్నాడు. అతను కాలేజీలో చదువుకునే రోజుల్లో సింగిల్ రోజ్ అనే అమ్మాయిని గాఢంగా ప్రేమించి ఆరాధన పెంచుకున్నాడు. కేవలం ఆ అమ్మాయి చదివి ఆనందించాలనే తపనతో కొన్ని ప్రేమ కథలు ఆ రోజుల్లోనే రాసేడు. ఆ కథలు ఆ పిల్ల చదివిందో, లేదోగాని ఇతను మాత్రం శరపరంపరగా కథలు రాసేయడం మానుకోలేదు. పోనీ, ఆ పిల్లతో నీ ఆరాధన ఏమిటో చెప్పుకున్నావా అని అడిగేను. చెప్పుకుంటే చెప్పొచ్చు కొట్టేదని అన్నాడు. సింగిల్ రోజంటే మాటల్లో లేదుట. లెవల్ పరంగా పెద్ద స్టేకు ఫేమిలీ పిల్లట. ఎవరో డాక్టర్ని పెళ్ళి చేసుకుని ప్రస్తుతం ఆస్ట్రేలియాలో వుంటుందన్నాడు. నీ ఆరాధన భగ్నమైనందుకు నీకు బాధగా లేదా అని అడిగేను. బాధ ఎందుకు? ఆ పేరిట కథలు రాసి, కథారంగంలో గుర్తింపు తెచ్చుకున్నాను గదా అన్నాడతను. అతని ఆరాధన అతన్ని అన్యాయం చేయకపోవడం ఆనందించదగ్గ విషయం.

నేను యస్సెల్సీ చదువుకునే రోజుల్లో నాకో క్లాసుమేటుండేవాడు. పేరు అనవసరం, కొంచెమో, గొప్పో స్థితిపరుడే. అతన్ని బాగా చదివించి ప్రయోజకుణ్ని చేయాలని వాళ్ళ పెద్దవాళ్ళ కోరిక. ఆ రోజుల్లో సినీ హీరోయిన్‌గా ఒక తార వెలిగిపోతుండేది. మా క్లాసుమేటు సాక్షాత్తు ఆ తారను ఆరాధించడమే పనిగా పెట్టుకున్నాడు. ఒక కుక్కపిల్లకి ఆ తార పేరు పెట్టుకుని ముద్దుగా పిలుచుకునేవాడు. తన గది గోడల్నిండా ఆ తార బొమ్మల్నే అతికించేవాడు. ట్రంకు పెట్టెలమీద, తలుపు కిటికీ రెక్కలమీద కూడా ఆ తార బొమ్మల్నే అలంకరించేవాడు. చివరికి నోట్సు పుస్తకాలమీద అట్టలుగా గూడా ఆవిడ బొమ్మల్నే వాడుకునేవాడు. ఆ తార సినిమా వస్తే ఇతనికి పట్ట పగ్గాలుండేవికావు. ఎడా పెడా స్నేహితుల్ని వెంటేసుకుని సినిమాకు వెళ్ళేవాడు. ఆ తారని ఎవరో ప్రేమిస్తున్నారనే వదంతులొస్తే, ఘొల్లున

ఏడ్చేవాడు. రేపో మాపో ఫలానా మనిషిని పెళ్ళి చేసుకుందంటే గిలగిలా తన్నుకునేవాడు. ఏతా వాతా ఆ తారమీద తనకుగల ఆరాధన అతని చదువుని పాడుచేసింది. ఇప్పుడు ఆ తారకు గిరాకీ లేదు. చాలా అనామకంగా బ్రతుకు తోంది. ఆవిడ ఎట్లా బ్రతుకుతుందో వదిలేయండి. మా క్లాసుమేటు బాగా చితికిపోయి మదరాసు చేరుకున్నాడు. ఎంతో చదివించి, ఏదో చేయించాలను కున్న తల్లిదండ్రుల ఆశమీద నీళ్ళు చల్లి, స్టూడియోల్లో లైట్‌బోయ్‌గా పని చేస్తున్నాడు. ఇప్పటికీ ఆ తారమీద అతని ఆరాధన చెరిగిపోనందుకు గర్వించ వలసి వున్నా, జాలిగా కూడా వుంటుంది.